క్లుప్తంగా

కావమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల ముగిసిన అనంతరం మొదటి శుక్రవారం సందర్భంగా మహిళలు ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గురుకుల ప్రిన్సిపల్‌కు అభినందన



పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి

సదుం: స్థానిక ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఈనేపథ్యంలో విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సవితకుమారి, బీసీ సంక్షేమ కార్యదర్శి సత్యనారాయణ, ఎంజేపీ గురుకుల పాఠశాలల కార్యదర్శి మాధవీలత అభినందించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పది, ఇంటర్ రెండింటిలో వంద శాతం ఫలితాలు నమోదైన ఏకైక గురుకుల విద్యాసంస్థ కావడంతో పురస్కారం ప్రదానం చేశారని ఆయన చెప్పారు. ప్రిన్సిపల్‌ను పలువురు అభినందించారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక



బాలసుబ్రమణ్యంశెట్టి, రఘుపతిరెడ్డి

పుంగనూరు: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యంశెట్టిని, కార్యదర్శిగా రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇనాయతుల్లా షరీఫ్, సుధాకర్ రావు, జాయింట్ సెక్రటరీగా మహిపాల్‌రెడ్డి, ట్రెజరర్‌గా కేశవరెడ్డి, మెంబర్‌షిప్ చైర్మన్‌గా సురేష్, సర్వీస్ చైర్మన్లుగా గోపాలకృష్ణ, త్రిమూర్తిరెడ్డి, రజ్వి, పిఎల్.శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా డాక్టర్లు శివ, సరళ, పి.రాధాకృష్ణ, రెడ్డికార్తీక్, సరస్వతి, వరదారెడ్డి, ముత్యాలు, మహేంద్రరావు, శ్రీరాములు, రాంబాబు, రవికిషోర్‌ను ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్‌తో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన మంత్రి



రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి

పులిచెర్ల(కల్లూరు): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. హాస్పిటల్లో రోగులకు అందుతున్న సేవలపై రోగులను ఆరా తీశారు. రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలోటీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన మంత్రి

పుంగనూరు: రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం రెండు ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, దేశం నాయకుడు చల్లారామచంద్రారెడ్డితో కలసి బస్సులను ప్రారంభించారు. టీడీపీ నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీతోపాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మంత్రి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుంటను తలపిస్తున్న హైవే!

-వర్షమొస్తే ఇంతే



పలమనేరు: పట్టణ సమీపంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో నాగమంగళం వద్ద వర్షమొస్తే రోడ్డుపైకి వరదనీరు చేరి కుంటలా మారుతోంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా మరో మార్గం నుంచి హైవేలోకి వెళ్లి ఫ్లై ఓవర్ మీదుగా బెంగళూరువైపు వాహనాలు వెళ్లవలసి వస్తోంది. ఈ సమస్య కొన్నేళ్లుగా పీడిస్తున్నా హైవే అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. రోడ్డు నిర్మాణ సమయంలో ఇంజినీర్ల సాంకేతిక తప్పిదాలతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మళ్లీ టమారా!

పలమనేరు ప్రాంతంలోని టమాట రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతుండడంతో కుదేలవుతున్నారు. ఇప్పటికే ధరల్లేక తీవ్ర నష్టాల పాలైన రైతులకు ఇప్పుడు వరుణుడి దెబ్బ పడింది.

- రైతులకు దెబ్బమీద దెబ్బ!
- పలమనేరులో బాక్సు రూ.30
- భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న తోటలు

పలమనేరు: మండలంలో నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు టమాట తోటల్లోని కాయలు దెబ్బతిని, కుళ్లిపోయి, ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఇప్పటికే ధరలు పతనమై చాలామంది రైతులు టమాటాలను కోయకుండా తోటల్లోనే వదిలివేశారు. స్థానిక మార్కెట్‌లో బాక్సు (15కిలోలు) ధర రూ.30 ఉంది. అంటే కిలో రూ.2 మాత్రమే. ఎకరా తోటలో కాయలు కోసేందుకు పదిమంది కూలీల అవసరముంది. ఒక్కో కూలీకి రోజుకు రూ.400 అయితే పదిమందికి రూ.4వేలు ఇవ్వాలి. ఇక రోజుకు 50 బాక్సుల టమాటాలను మార్కెట్‌కు తీసుకెళితే రైతుకు దక్కేది రూ.1,500 మాత్రమే. దీనికితోడు టమాటాను మార్కెట్‌కు తరలించేందుకు రవాణా చార్జీలు అదనంగా పెట్టాలి. ధరల పతనం, కోత కూలీల ఖర్చు.. వెరసి గిట్టుబాటు కాకపోవడంతో కాయలను కోయకుండా తోటల్లో వదిలేశారు. దీనికి తోడు పండిన కాయలు వర్షాల కారణంగా కుళ్లిపోయాయి. ఫలితంగా టమాటా రైతులు నిండా మునిగిపోయారు. చాలామంది రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడి దక్కక అప్పుల పాలవక తప్పడం లేదు. పలమనేరు మండలంలోని చెన్నుపల్లెకు చెందిన రమేష్ రెడ్డి రెండెకరాల్లో టమాట సాగు చేసినా ధరల్లేక కాయలను కోయకుండా తోటలోనే వదిలేశారు. ఇలాంటి రైతులు ఈ ప్రాంతంలో చాలామంది ఉన్నారు.



పలమనేరు మండలం చెన్నుపల్లె వద్ద కాయలు కోయకుండా వదిలేసిన టమాట

అంగన్‌వాడీ కేంద్రాలకు కో–ఆర్డినేటర్ల నియామకం

కుప్పం: నియోజకవర్గంలో అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే పిల్లల్లో మానసిక వ్యాధితో బాధపడుతున్న వారి ప్రత్యేక పర్యవేక్షణ కోసం కేర్ ఎన్ గ్రో సంస్థ ద్వారా కొందరు కో–ఆర్డినేటర్లను నియమించారు. కుప్పం కడా ఆధ్వర్యంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. కడా, కేర్ ఎన్ గ్రో సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ విధానం గ్రామీణ స్థాయిలో పిల్లల అభ్యున్నతికి దోహదపడుతుందని కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఫీల్డ్ కో–ఆర్డినేటర్లకు 300 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 19 మందిని ఎంపిక చేసి అధికారికంగా నియమించినట్టు చెప్పారు. 428 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల లోపు పిల్లలు 21 వేల మంది ఉన్నారని, వీరిలో మానసిక వ్యాధిగ్రస్తులు, బుద్ధిమాంద్యం గల పిల్లలను ప్రత్యేకంగా కో–ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం,టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్ పాల్గొన్నారు.



కోఆర్డినేటర్లకు నియామక పత్రాలు ఇస్తున్న దృశ్యం

ప్రమాదాల నుంచి కాపాడుకోవడంపై అవగాహన



యువతకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుప్పం: అకస్మాత్తుగా ప్రమాదాలు, యుద్ధాలు, విమానాల దాడులు జరిగినప్పుడు ప్రజలు తమను తాము ఎలా కాపాడుకోవాలి? అనే అంశంపై ఆర్డీఓ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భారతదేశం పాకిస్థాన్‌పై సిందూర్ ఆపరేషన్ పేరిట త్రివిధ దళాలతో చేసిన దాడులు, పాక్ ప్రతిదాడులను నిర్వీర్యం చేయడం ..అలాంటి ఉదంతాల్లో ప్రజలు సురక్షితంగా ఎలా ఉండాలో తెలియజేశారు. అలాగే పెను ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు వాటిల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్డీఓ శ్రీనివాసరాజు అన్నారు. అలాంటి విపత్తు పరిస్థితుల్లో స్వచ్ఛందంగా యువత స్పందించి, అధికారులకు సహకరించి, ప్రజలను కాపాడే ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, తహసీల్దారు చిట్టిబాబు, సీఐలు మల్లేశ్‌యాదవ్, పోలీసులు పాల్గొన్నారు.

వానపడితే మార్కెట్ రొచ్చు..రొచ్చే!



బురదమయమైన పలమనేరు టమాట మార్కెట్

పలమనేరు: పట్టణంలో వర్షం కురిస్తే టమాట మార్కెట్ రొచ్చురొచ్చుగా మారుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మండీల ముందు నడచి వెళ్లేందుకు కూడా వీలు కాని విధంగా బురదమయం అవుతోంది. ఇక మండీలలో వేలం ముగిశాక గ్రేడింగ్ చేసిన టమాటాల్లో నాసిరకం కాయలను మండీల ముందే పడేశారు. ఇవి కుళ్లి దుర్గంధం చిమ్ముతున్నాయి. మరోవైపు ఇష్టానుసారంగా మార్కెట్‌లో కాయల లోడింగ్‌కు వచ్చే వాహనాలు, టమాటాల లోడింగ్, అన్ లోడింగ్‌ల తో అస్తవ్యస్తంగా మారింది. స్థానిక మార్కెటింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బురదతో అగచాట్లు

మార్కెట్‌లో అసలే వ్యర్థాలెక్కువ. అలాంటిది వర్షం పడినప్పుడు మరింత అధ్వానంగా ఉంటోంది. అంతా బురద..బురదే. మండీల ముందు నడచివెళ్లాలన్నా ఇబ్బందే. ఇక మండీల నిర్వాహకులు బాగాలేని టమాటాలను ఎక్కబడితే అక్కడ పడేస్తున్నారు. దీనిపై మార్కెటింగ్ అధికారులు దృష్టి పెట్టాలి. మార్కెట్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

-సుబ్బన్న, కల్లాడు, టమాట రైతు

ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, అందిస్తున్న సేవల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే అత్యవసర రోగులకు అవసరమైన చికిత్స, వైద్యసేవలు అందివ్వాలని ఆయన ఆదేశించారు. ఎక్కువగా ఇక్కడ రెఫర్లు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని, ప్రభుత్వం కోట్లాది రూపాయలతో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించిందని, ఇవన్నీ రోగులకు ఉపయోగపడేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆర్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



బైరెడ్డిపల్లె: చలగానిపల్లెలో కూలిన షెడ్డు

బైరెడ్డిపల్లె: మండలంలో గురు, శుక్రవారాల్లో గాలీవాన బీభత్సానికి అపార నష్టం వాటిల్లింది. కోతదశలో ఉన్న మామిడి కాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బేలుపల్లె పంచాయతీ చలగానిపల్లెకు చెందిన చెందిన రమణారెడ్డి పశువుల షెడ్డు నేలమట్టం కావడంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన ప్రమీలమ్మ ఇంట్లో ఉన్న సమయంలో పై కప్పు కూలడంతో తీవ్రగాయాలై తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పెనుగాలుల వలన పంటలు నష్టపోయామని, తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం ముఖ్యం



మాట్లాడుతున్న హెచ్ఈఓ ఉదయభాస్కర్

సదుం: కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని చింతలవారిపల్లె సచివాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. గర్భవతులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్వేత, అలివేలమ్మ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు మండల సమావేశం

- పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

గంధం ఊరేగింపుతో ఉరుసు ప్రారంభం

పుంగనూరు: పెద్దపంజాణి మండలం చీమనపల్లెలోని హజరత్‌జాన్‌పాక్షావలి బాబా దర్గా వద్ద ఉరుసు శుక్రవారం రాత్రి గంధం ఊరేగింపుతో మొదలైంది వందలాది మంది ముస్లింలు భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగించారు. దర్గాను పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి ఖవ్వాలి పోటీలు నిర్వస్తామని, పేదలకు అన్నదానం చేయనున్నట్టు దర్గా కమిటీ అధ్యక్షుడు అష్రఫ్ తెలిపారు.

ఓటర్లుగా నమోదుకండి

పుంగనూరు: 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాము అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు– చేర్పులతో పాటు అధిక శాతం ఓట్లు కలిగిన ప్రాంతాలలో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..ఇత్యాది వాటిపై అన్ని పార్టీల నుంచి సలహాలు–సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు వెంకట్రమణారెడ్డి, రామమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌తో ఆదుకోవాలి



ఎంఆర్‌పీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సువర్ణరాజు, శేఖర్ తదితరులు

పుంగనూరు: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేసి ఆదుకోవాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటునివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్, దళిత నేతలు చెన్నరాయుడు, రామయ్య, నాగేనాయక్, వెంకట్రమణ, బీజేపీ నాయకుడు అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



గంగవరం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం: స్థానిక పీహెచ్‌సీ, పత్తికొండ పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీపై వేర్వేరుగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నీటి నిల్వలు ఉంటే టైగర్ దోమలు వృద్ధి చెంది, ప్రాణాంతక డెంగీ జ్వరానికి కారణమవుతుందని, ఈ దోమ కాటుకు గురైతే 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి బైటపడుతుందన్నారు. ఇది మూడు రకాలుగా ఉంటుందని, అలాగే దోమకాటు వలన డెంగీనే కాకుండా మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, చికున్‌గున్యా లాంటి వాటి బారిన పడి ప్రాణాల మీదుకు తెచ్చుకోరాదన్నారు. వీటి బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలతోపాటు మంచి నీటి తొట్టెలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని వైద్యాధికారులు కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి లహరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: దోమల వల్ల వివిధ జ్వరాల బారిన పడే అవకాశం ఉందని, నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీశా కోరారు. జాతీయ డెంగీ నివారణ మాసం పురస్కరించుకుని శుక్రవారం సదుంలో డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నీలకంఠ, జానకి, శిఖామణి, సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థంలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ తమ సిబ్బందితో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది హరి, రెడ్డెమ్మ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



పత్తికొండ పీహెచ్‌సీలో ర్యాలీ



సదుంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



బైరెడ్డిపల్లె: తీర్థంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



జలధికి పోటెత్తిన జనం (ఇన్‌సెట్) అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

నిమజ్జనంతో ముగిసిన జాతర

- భక్తులతో క్రిక్కిరిసిన బజారువీధి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పలమనేరు: పట్టణంలో గంగమ్మ జాతర మూడో రోజైన శుక్రవారం అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. తెల్లవారుజామున అమ్మవారి ఆలయం వద్ద నుంచి శిరస్సు మెరవణి బజారువీధి, జిలానీక్రాస్, రామ లక్ష్మణ థియేటర్ రోడ్డు మీదుగా గాంధీనగర్ చివరి వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవులు, బ్యాండ్‌సెట్, విచిత్ర వేషధారణలు మొదలైన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు టెంకాయలను కొట్టి మొక్కులు చెల్లించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల పటిష్ట బందోబస్తు నిర్వహించారు.. దీంతో జలధి కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.